క్లుప్తంగా

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం


వివరాలు సేకరిస్తున్న సంక్షేమాధికారి నరేశ్

జగిత్యాల: దివ్యాంగులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. మంగళవారం వివిధ రకాల వెన్నుముక వ్యాధులతో బాధపడుతున్న 16 మంది దివ్యాంగులకు ప్రత్యేక ఆరోగ్య క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరికి కావాల్సిన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఉందని, ముఖ్యంగా వికలాంగత్వం కలిగిన దివ్యాంగులకు ఆర్థోపెడిక్ డాక్టర్ విజయేందర్‌రెడ్డి పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తారన్నారు. అనంతరం వారందరికీ పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రమోద్, సూపరింటెండెంట్ రాములు, ఫీల్డ్ ఆఫీసర్ కొండయ్య పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో నాటేస్తే తక్కువ ఖర్చు


పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

జగిత్యాలఅగ్రికల్చర్: డ్రమ్ సీడర్‌తో వరి నాటు వేస్తే ఖర్చు తగ్గుతుందని జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలంలోని హస్నాబాద్ గ్రామంలో మంగళవారం డ్రమ్ సీడర్‌తో దూడ గంగాధర్ అనే రైతు వరి నాటు వేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డ్రమ్ సీడర్ ద్వారా విత్తన ఖర్చు తగ్గడమే కాకుండా, నారును పెంచడం, నాటు వేయడం వంటి పనులు ఉండవన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వినీల, ఏఈఓ నాగరాజు, రైతులు సతీష్, దామోదర్ రావు, భూమరావు, రాజేందర్ రావు, గంగన్నలు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీకి స్థల పరిశీలన


స్థలం పరిశీలిస్తున్న నాయకులు

మేడిపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, స్థానిక నాయకులు మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయం వెనుక సుమారు రెండెకరాల భూమిని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, మాజీ ఎంపీపీ ఇజ్రాయిల్, మాజీ ఎంపీటీసీ దాసరి శంకర్, నాయకులు మార్గం నర్సారెడ్డి, ఉర్మాట్ల నర్సయ్య, దోనిపాల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కేడీసీసీ బ్యాంక్ మేనేజర్

కథలాపూర్: కేడీసీసీ బ్యాంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కథలాపూర్ బ్రాంచ్ మేనేజర్ విజయ్ పవన్ కోరారు. మండలంలోని చింతకుంట, కథలాపూర్ గ్రామాల్లో మంగళవారం కేడీసీసీ బ్యాంక్ సేవలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపాజిట్లపై వడ్డీకి స్పెషల్ డ్రైవ్ ఉందన్నారు. వాణిజ్య బ్యాంకులతో సమానంగా కేడీసీసీ బ్యాంకులో సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, వినియోగదారులు పాల్గొన్నారు.

మూత్రశాలలు కూల్చివేత

జగిత్యాల: జగిత్యాల బస్టాండ్‌లో ఉన్న మూత్రశాలలను ఆర్టీసీ అధికారులు కూల్చివేశారు. మూత్రశాలల సమీపంలో బైక్ పార్కింగ్ షెడ్డు ఉంది. అది సరిపోకపోవడంతో దీని సమీపంలో ఉన్న మూత్రశాలలు కూల్చివేశారు. బస్టాండ్‌లో ఇప్పటికే రెండు ఉన్నాయని, దీనిని కూల్చివేస్తే నష్టమేమీ లేదని ఆర్టీసీ డీఎం తెలిపారు. కానీ నిత్యం ఈ బస్టాండ్‌కు అత్యధికంగా ప్రయాణికులు వస్తారని, మూత్రశాలలు ఉండాల్సిందేనని మరికొందరు కోరుతున్నారు.


సీసీరోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ పోల్


నాసిరకం పనులతో తేలిన కంకర


సీసీరోడ్డుకు ఇరువైపులా పోయని మొరం

అస్తవ్యస్తంగా అభివృద్ధి పనులు

- నాసిరకంగా పనులు
- చోద్యం చూస్తున్న అధికారులు


రాయికల్ 2వ వార్డులో నాసిరకంగా నిర్మించిన మురికికాలువ

రాయికల్: పట్టణంలో చేపట్టిన పనుల్లో నాణ్యత కొరవడి అస్తవ్యస్తంగా మారాయి. రాయికల్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.2.70 కోట్లతో సీసీరోడ్లు, రూ.1.30 కోట్లతో చేపడుతున్న మురికికాలువ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. పట్టణంలోని పలువార్డుల్లో సీసీరోడ్లు, మురికికాలువల నిర్మాణాల కోసం రూ.4 కోట్ల నిధులను పంచాయతీరాజ్‌కు కేటాయించారు. ఆన్‌లైన్‌లో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు తమను అడిగే వారే లేరని ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నాడు.

పట్టణంలోని 2 వ వార్డులో మురికికాలువ నిర్మాణ పనులు పూర్తిగా నాణ్యత లోపించడంతో పాటు, నిర్మించిన 10 రోజుల్లోనే మురికికాలువల నుంచి కంకర తేలడం కాంట్రాక్టర్ పనితీరుకు నిదర్శనంగా మారింది. అంతేకాకుండా సీసీరోడ్లలో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. సీసీరోడ్డుకు ఇరువైపులా మొరంతో నింపాల్సి ఉండగా నింపకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1వ వార్డులో మురికికాలువలో అడ్డుగా ఉన్న స్తంభాలను తొలగించకుండానే పనులు చేపట్టారు. 8వ వార్డులో సైతం విద్యుత్ స్తంభా న్ని తొలగించకుండా సీసీ రోడ్డు నిర్మించడంతో వా హనదారుల రాకపోకలు ఈ రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ అధికారి చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాసిరకంగా పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని పనులను నాణ్యతగా చేసేలా చూడాలని కోరుతున్నారు.

పనులు నాసిరకంగా ఉన్నాయి



మా 2వ వార్డులో చేపట్టిన మురికికాలువ నిర్మాణ పనులు, సీసీరోడ్డు పనులు పూర్తి గా నాసిరకంగా ఉన్నాయి. మురికి కాలువలు నిర్మించిన 15 రోజు ల్లోనే కాలువ నుంచి కంకర దర్శనమిస్తుంది. అంతేకాకుండా నిర్మాణం సైతం సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పర్యవేక్షించాలి. – కన్నక మహేందర్, కౌన్సిలర్ 2 వార్డు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం



పట్టణంలోని 2వ వార్డులో నాసిరకంగా పనులు చేపడుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. ఎక్కడ నాసిరకంగా పనులు జరిగినా మరోసారి వాటిపై నిర్మాణం చేపట్టేలా ఒత్తిడి తీసుకొస్తాం. అలాగే పలు వార్డుల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నాం. – ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ

అంబేడ్కర్ విగ్రహాలకు బీఆర్ఎస్ వినతి



కోరుట్ల, రాయికల్‌లో అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పెగడపల్లిలో..

కోరుట్ల/ధర్మపురి/రాయికల్/పెగడపల్లి/సారంగాపూర్: లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ పలు చోట్ల మంగళవారం బీఆర్ఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు బేడీలు వేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పట్టణ అధ్యక్షులు, మండలాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంఈవో దామోదర్‌రెడ్డి

మల్లాపూర్: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచి ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో కే.దామోదర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ మండల కేంద్రంతో పాటు రాఘవపేట గ్రామాల్లో స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో సకల వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే బోధన జరుగుతుందన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అభ్యాసన ఫలితాలు సాధించాలి

పెగడపల్లి:విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో సులోచన, జిల్లా సెక్టోరియల్ అధికారులు సత్యనారాయణ, మహేశ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని బతికపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: విద్యార్థులు అభ్యాసన ఫలితాలు సాధనతో పాటు, స్పష్టంగా రాయడం, చదవడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చేయాలని కాంప్లెక్స్ హెచ్ఎం మామిడాల శ్రీనివాస్ కోరారు. మండలంలోని అల్లీపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం రాయికల్, మేడిపల్లి, బీమారం మండలాలకు చెందిన తెలుగు బోధకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెనుకబడిన విద్యార్థులు ఏ విధంగా ఎక్కువ మార్కులు సాధించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్పీలు చెరుకు మహేశ్వరశర్మ, నారాయణగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగమల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు

మేడిపల్లి: భీమారం మండలంలోని రాగోజీపేటలో దొంగ మల్లన్న జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం చివరి రోజు సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు, కరీంనగర్ మాజీ జెడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ హొద్దినేని హరిచరణ్ రావు తదితరులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

పద్మశాలీ రాష్ట్ర కార్యదర్శులుగా జక్కుల చంద్రశేఖర్,వినోద్‌కుమార్

జగిత్యాల: పద్మశాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జగిత్యాలకు చెందిన తాటిపాముల వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా కొక్కుల రాజేశ్ నియామకమయ్యారు. వీరి నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాయికల్: పద్మశాలీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వల్లంకంటి రాజ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.

కేజీవీల్స్‌తో రోడ్డెక్కితే ట్రాక్టర్లు సీజ్

మల్లాపూర్: రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను నడిపితే యజమానులపై కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వీర్‌సింగ్ మంగళవారం హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లు వరినాట్లకు కేజీవీల్స్ అమర్చి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టానుసారంగా రోడ్లపై నడుపుతున్నారని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కేజీవీల్స్‌తో రోడ్లపై నడిపే ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కేజీవీల్స్ ట్రాక్టర్‌కు జరిమానా

రాయికల్: మండలంలోని మూటపల్లి నుంచి మంగళవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ రాయికల్‌కు వస్తుండగా టీఎస్ 21 కే 7663 నంబరు గల ట్రాక్టర్ కేజీవీల్స్‌తో రోడ్డుపై వెళ్తోంది. దీనిని గమనించిన జిల్లా కలెక్టర్ సంబంధిత ట్రాక్టర్‌పై జరిమానా విధించాలని తహసీల్దార్ ఖయ్యూంను ఆదేశించగా, ట్రాక్టర్ యజమానికి జరిమానా విధించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న డీఈవో

జగిత్యాల: విద్యార్థులకు హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని, పరిశుభ్రత పాటించాలని డీఈవో రాము అన్నారు. మంగళవారం జిల్లాలోని పలు స్కూల్ కాంప్లెక్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రగతి సాధించాలంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. అనంతరం కేజీబీవీలను, హాస్టళ్లను తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా కో–ఆర్డినేటర్ కొక్కుల రాజేశ్, ఎంఈవోలు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్యాల మండలం రామన్నపేటకు చెందిన స్కూల్ అసిస్టెంట్ అందె నారాయణ 200 సంవత్సరాల క్యాలెండర్‌ను డీఈవో ఆవిష్కరించారు. 200 సంవత్సరాల క్యాలెండర్ ఎందరికో ఉపయోగపడుతుందన్నారు.

పెన్షనర్ల సంఘం భవనానికి నిధులు మంజూరుకు కృషి

కోరుట్ల: పట్టణంలో పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి రూ. 3 లక్షలు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. పట్టణంలో మంగళవారం పెన్షనర్స్ డే సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు అన్నం అనిల్, పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘం భవనంలో మంగళవారం పెన్షనర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొరిడె విశ్వనాథశర్మ, పొనుగంటి దత్తాత్రి, చిన్న రామకిష్టయ్య, పాల్గొన్నారు.

బిల్కుల మల్లన్నకు మొక్కులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా గ్రామంలో బిల్కుల మల్లన్న స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మల్లన్న స్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్, మాజీ సర్పంచ్ గంగాధర్, దొెట్టి కాంత, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

కారోబార్ల ముందస్తు అరెస్ట్


కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కారోబార్‌లు

కోరుట్ల రూరల్/రాయికల్/ సారంగాపూర్: గ్రామ పంచాయతీ కారోబార్లు తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు వెళ్తారనే సమాచారంతో కోరుట్ల, సారంగాపూర్, రాయికల్ మండలాలకు చెందిన కారోబార్లను పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు.

ఏఎన్ఎంల బైండోవర్

జగిత్యాలక్రైం: తమ సమస్యలను పరిష్కరించాలని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వగా, మంగళవారం పట్టణ పోలీసులు వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి బైండోవర్ చేశారు.



సారంగాపూర్: మండలంలోని రేచపల్లి, సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాలో సాగునీరందించే ఎస్సారెస్పీ డీ-53, 12ఎల్–1ఆర్ కాలువలు చాలా చోట్ల అధ్వాన్నంగా మారాయి. రేచపల్లి లంబాడ తండా వద్ద కాలువ నిండా మట్టి నిండిపోవడంతో దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేదు. కాలువలో పూర్తి చెట్లు, ముళ్లపొదలతో నిండిపోయింది. మరో వారం రోజుల్లో యాసంగికి నీరు విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాలువల దుస్థితి ఇలా ఉంటే కాలువ చివరి భూములకు నీరు అందదని, కాల్వలు శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చక్రూనాయక్, డీఈ నీటిపారుదల శాఖ, సెల్ నంబర్: 9652638815

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

- **రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు విద్యార్థి ఎంపిక**

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కాకతీయ విద్యాలయానికి చెందిన 5వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎం. చరణి జిల్లా స్థాయి సీఎం కప్ అండర్–15 చదరంగం పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రాపెల్లి సంజయ్ మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

- **జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మండల విద్యార్థి ప్రతిభ**

మల్లాపూర్: జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మండలంలోని వీవీరావుపేటకు చెందిన విద్యార్థి రాయన్ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయిలో రెండోస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా రాయన్‌ను పలువురు అభినందించారు.

- **కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం**

జగిత్యాల: ఇందిరమ్మ మహిళా శక్తి కుట్టుమిషన్ పథకం కింద మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టుమిషన్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఆర్ఎస్.చిత్రు తెలిపారు. మైనార్టీ మహిళలకు ఈ స్కీం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, ఆసక్తి గల మహిళలు నిరుద్యోగ మైనార్టీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

- **విద్యార్థులకు అభినందన**

జగిత్యాల: జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఎప్‌సెట్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి పలు ఇంజనీరింగ్ కళాశాల్లో సీట్లు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

జగిత్యాలటౌన్: జగిత్యాల జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ -17బాలుర కిక్ బాక్సింగ్ పోటీల్లో జగిత్యాల పట్టణం గర్ల్స్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న అభిలాష్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు పీడీ రాధిక తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని మంగళవారం ఉపాధ్యాయులు అభినందించారు.

- **ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి**

జగిత్యాల: ఎన్నికల హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌అన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, రవీందర్ పాల్గొన్నారు.

- **సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

వెల్గటూర్ : ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి తోడ్పడుతుందని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గుండాటి గోపిక అన్నారు. వెల్గటూర్ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి, తహశీల్దార్ శేఖర్, నాయకులు పాల్గొన్నారు.

- **అధికారులకు సత్కారం**

జగిత్యాల:జగిత్యాల జిల్లా పశువైద్య శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సంతోష్‌కుమార్ ఇటీవల పదోన్నతిపై నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే సీనియర్ అసిస్టెంట్ శ్రావణి బదిలీపై వెళ్లగా వారిని మంగళవారంఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేశ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

- **15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత**

మెట్‌పల్లి: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో మంగళవారం అమర్ అనే వ్యక్తి ఇంటిపై పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 15క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

- **1100 ఇళ్ల సర్వే పూర్తి**

సారంగాపూర్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన సర్వేలో ఇప్పటి వరకు 1100 ఇళ్ల సర్వే పూర్తి చేసినట్లు ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. మంగళవారం పెంబట్ల గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు.

- **ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన**

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో మంగళవారం ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులు ప్రభాకర్ 72 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 26 మందికి ఆపరేషన్ల కోసం రేకుర్తి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శాంతభూషన్, ప్రధాన కార్యదర్శి భోనగిరి భూమేష్, మాజీ అధ్యక్షులు ఎలేటి చిన్నారెడ్డి, నేమూరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

- **సీసీరోడ్డు పనులు ప్రారంభం**

జగిత్యాలరూరల్: మండలంలోని హన్మాజీపేటలో రామాలయానికి వెళ్లే రహదారికి ఇటీవల సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీ అర్వింద్ నిధులు మంజూరు చేశారు. మంగళవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్ద గంగారాం, జిల్లా అధికార ప్రతినిధి దివాకర్, కార్యవర్గ సభ్యులు ఇట్నేని రమేశ్, నాయకులు బొడ్డు లక్ష్మణ్, దామోదర్, మహేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

- **బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి**

కథలాపూర్: బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి కార్యకర్తలు కీలకమని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల మారుతి అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలం కలిగోట, పోతారం గ్రామాల్లో బూత్‌స్థాయి కమిటీ ఎన్నికలు నిర్వహించి అధ్యక్ష, కార్యదర్శులను శాలువాలతో సన్మానించారు. రాబోయే స్థానిక ఎన్నికల కోసం ప్రతీ బీజేపీ కార్యకర్తలు, నాయకులు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్‌రావు, బండ అంజయ్య, జలందర్, నరేందర్, శ్రీధర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

- **దొంగల కోసం పోలీసుల గాలింపు**

జగిత్యాలక్రైం: పట్టణంలోని పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న మహిళ బ్యాగులోంచి బంగారం కాజేసిన దొంగల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లికి చెందిన మిట్టపల్లి జలజ పాత బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం బస్సు ఎక్కుతుండగా గుర్తుతెలియని దొంగలు బ్యాగు కింది భాగం కట్ చేసి బంగారం ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులు సీసీపుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

- **కమిషనర్‌కు వినతి**

రాయికల్: పట్టణంలోని 3వ వార్డులో డ్రెయినేజీ నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ నిర్మించాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, గోపి, వంశీధర్‌రెడ్డి, రాజేందర్, సత్తయ్య పాల్గొన్నారు.

- **బేటి బచావో బేటి పడావోపై అవగాహన**

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారత ఆధ్వర్యంలో సరస్వతి గ్రామైక్య సంఘం మంగళవారం బేటి బచావో బేటి పడావోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సఖి సేవలు, చట్టాలు, సైబర్ నేరాలు, అంగన్‌వాడీల సేవలు తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ చైతన్య, ఎంపీడీవో రవీందర్, జిల్లా మహిళా సాధికారిత సభ్యులు గౌతమి, స్వప్న, హేమశ్రీ పాల్గొన్నారు.